
నటించను!

నేను అతన్ని రోజూ చూస్తూనే ఉన్నాను, గమనిస్తూనే ఉన్నాను - రోజూ నాకేసి అదోలా ఏదో పోగొట్టుకున్న వాడిలాగా, ఏదో దొరకక ఇబ్బంది పడుతున్న వాడిలాగ చూస్తుంటాడు. నాకు తెలుసు అతను నాలో ఏం వెతుకుతున్నాడో!

పిచ్చివాడు - అతనికి తెలీదు. అతను నాలో వెతుకుతున్నదేదో అది ఎన్నాళ్ళ క్రితమో చచ్చిపోయింది. కాదు, బలవంతంగా చంపేసారు. ఒకరు, ఇద్దరూ కాదు, మూకుమ్మడిగా చేసిన హత్య అది!

పద్మవ్యూహంలో ఓ అభిమన్యుడి చావు గుర్తుకొస్తోంది నాకు!

నిజమే!

బతికి ఉన్న రోజులలో ఎంత హాయిగా అభిమన్యుడి తండ్రిలాగా బతికాను. అర్జునుడిలాగా సవ్యసాచిలా సంపాదించాను. రెండు చేతులా సంపాదించాను. సంపాదించిందెంతో తెలీనంతగ, లెక్క లేనంతగా!.

ఈ రోజుల్లో వెనక్కి తిరిగి చూసుకొంటుంటే ఏం మిగిలింది?

ధనమా? ఆకాంక్షా??. ఏది లేదు.

సంపాదించింది సంపాదిస్తోంటే, రెండో చేతికి సైతం తెలీకుండా ఖర్చు చేశాను. ఖర్చంటే ఖర్చా కాదది, డబ్బనేది ఎవరికైనా ఉంటే ఎలా సద్వినియోగ పరచవచ్చునో నన్ను చూస్తే ఆ క్షణంలో తెలిసేది.

సరోజ అనేది - 'మీకసలు లోకజ్ఞానం లేదండి! ఈరోజు ఇలా ఖర్చు చేసేస్తే, రేపనేరోజు మనకొకటి ఉందనేది గుర్తుకొస్తే భయం వేయటం లేదుటండీ' అని.

సరోజ అమాయకురాలు.

ఈ రోజు సంతృప్తిగా గడుపుకోగలిగితే, రేపటిలో అసంతృప్తి ఎందుకు ఉంటుంది? - ఏది ఏమైనా మనిషి దృక్పథంలో ఉంటుంది.

అదే అనేవాణ్ణి నేను సరోజతో - "పుట్టిన రోజు ఇంత సిరిసంపదలతో పుట్టామా సరోజా! పోయేసరికి ఇవన్నీ కూడా వచ్చేనా?".

"మీకింత వేదాంత జ్ఞానం కూడా ఉందని నాకిన్నాళ్లూ తెలీదు" అనేసి, కొంచెం నవ్వేసి, ఊరుకుండిపోయేది సరోజ.

నాకు తెలుసు - సరోజ అలా పైకి అంటుందేకానీ, నిజానికి అలా అనే మనస్తత్వం కాదు తనది. కానీ ఆడతనం - ఏం చేస్తుంది? అలా అప్పుడప్పుడు అంటుందే కానీ సరోజ నా అర్ధాంగి. నేనేం చేసినా ఆమోదిస్తుంది. ఆ మాటా ఒకసారి తనే అనేసింది - 'ఆడదాన్ని! కట్టుకున్న భార్యను, మీరు సుఖపడక, నన్నూ సుఖపడనివ్వక, ఎందుకింతగా సంపాదించటం?- మీరే ఆలోచించండి. ఈ రోజు మీకూ నాకూ ఏం తక్కువ? అయినా ఇద్దరిలో ఏ ఒక్కరిలోనైనా సంతృప్తిగా బతుకుతున్నామనే భావన ఉందా? మీరే చెప్పండి.'

ఆ రోజున ఆలోచించాను. ఔను - సరోజ అంటున్నదాంట్లో అక్షరం అబద్ధం లేదు. ఇద్దరమూ ఒక గూటి పక్షులుగా బతుకుతున్నాము. అంతేగానీ ఇద్దరిలోనూ ఆ తృప్తి మిగిలి ఉందా అనేది సంశయాత్మకమే! ఇంత సంపాదించి ఏం చేసుకోను?

ఆలోచనలన్నీ ఒక తాటిమీదకు నడిపించి, చివరకు మనిషిగా నేను చేరుకోవాల్సిన గమ్యం, ఆ తర్వాత చేరుకొన్నాను.

వెంటనే అందరితోనూ చెప్పేశా "ఇకమీదట ఆదివారం పనిచేయను. సాయంత్రం అయిదు తర్వాత పనిచేయను. ఔట్‌డోర్‌లో అయితే పదిరోజుల పనికి రెండు రోజులు సెలవు."

అందరూ విన్నారు - అవసరం వాళ్లది. ఎవరికోసం వింటారు? నా బొమ్మ కనపడితే చాలు, ఆంధ్రదేశంలో అన్ని చోట్లా ఆ సినిమా వంద రోజులు ఆడాల్సిందే! - ప్రేక్షకులంతా అభిమానధనంతో నన్ను ముంచేస్తున్నారు - వాళ్ల అభిమానంతోనే ఆడుతున్న సినిమాలన్నీ అన్నేసి రోజులు 'దిగ్విజయంగా ప్రదర్శించబడుతున్నాయి' అంతేగానీ....

ఇక్కడ ఆడేవి సినిమాలా?

వీటిలో ఓ కథా, కాకరకాయా? - ఓ సంగీతమా, ఓ సాహిత్యమా?? -

వీటిలో ఏ ఒక్కటి ఉన్నా, అన్నీ కలిసికట్టుగా ఉన్నా కానీ ఆడని సినిమా, నా బొమ్మతో వచ్చేసరికి, ఆంధ్రప్రజానీకానికి అదేం మాయ కమ్ముతుందోగానీ, ఆ సినిమా శతదినోత్సవాలూ, రజతోత్సవాలూ.. అంతే!

అంతటి కథానాయకుడిని నేను. ఆ రోజున నిర్ణయించుకోవటం మంచికి జరిగిందో, చెడుకే జరిగిందో కానీ నేను నా ఇంటికి దగ్గరయ్యా.. ఇంట్లో ఉంటే ఇంత హాయి, ఇంతటి ప్రశాంతత ఉంటాయని నాకిన్నేళ్లూ తెలీదు.

ఆర్క్‌లైట్లు, కెమేరాలకు దూరంగా - కట్, ఆన్, ఆఫ్‌లకు అతీతంగా...

ఇంట్లో - ఇంత హాయిగా ఆప్యాయతతో జీవితం పంచుకొనే సరోజతో - గడిపితే ఎంత బాగుంటోంది?

ఇన్నేళ్లూ నాకెందుకు కలగలేదు ఈ జ్ఞానోదయం?

కొన్నాళ్లు బాగానే గడిచాయి. కానీ ఆ తర్వాతే అర్థమయిపోసాగింది నాకూ, సరోజకూ.

కష్టపడి చేసే పని తర్వాత విశ్రాంతి కోరుకోవటం తప్పు అన్న సంగతి తెలిసి వచ్చేసరికి పరిస్థితి చేయి దాటిపోసాగింది.

పరిశ్రమ నా చేతిలోంచి జారిపోయింది. ఇంతకాలమూ నా వెంట తిరిగిన చిత్ర పరిశ్రమ, చిత్రంగా మారిపోయింది - ఇప్పుడు నేను దానివెంట తిరిగినా అది నాకేసి తిరగటం మానేసింది.

ఆ ఆర్క్‌లైట్లకూ, కెమేరాలకూ, షాట్‌కూ, షూట్‌కూ దూరంగా బతకలేకపోయాను. చాలా రోజులు ఆ స్టూడియోలలో అటూ ఇటూ తిరిగి వచ్చేసేవాడిని. నా రాక కూడ వాళ్ళకు ఇబ్బంది అవుతోందన్న సంగతి గమనించి అదీ మానేసాను.

తెరమీద ఎన్ని రకాల వేషాలు వేసినా అవన్నీ జీవితంలో వెయ్యకూడనివీ, వెయ్యలేనివీ అయిపోయాయి. తెరమీద ఎన్ని రకాల పనులు క్షణాలమీద చేసేయగలిగినా, వాటిల్లో ఓ ఒక్కటీ నిజజీవితంలో చేయలేకపోవటం నా దౌర్భాగ్యం.

తెరమీద ఏపని ఎలా చేయాలో నిర్దేశించేవాళ్ళు అంతమంది ఉండేవారు. ఈ క్షణాల్లో ఏ ఒక్కరూ ఈ పని చెయ్యమని చెప్పరేం?

ఈ చేతులమీదుగా లక్షల రూపాయల నాట్యం చేశాయి. అవన్నీ ఏమై పోయాయి? ఏ వేలి సందుల్లోంచి వెళ్ళిపోయాయి?

ఈ రోజు ఇలా గడుస్తోందేం? ఇంత భారంగా, ఇంత ఘోరంగా, ఇంత నెమ్మదిగా ఎపుడైనా గడిచిందా రోజు? ఇంత క్రితం ఎపుడూ ఈ స్టూడియోనుంచి ఆ స్టూడియో చేరుకొనేసరికే ఆలస్యం అయిపోయేది కాలం - అదంతా మళ్ళీ వెనక్కు రాదేం? ఒక్కసారి.. ఒక్కసారి... ఒకసారి తిరిగి వస్తే...

కూరలు కొనుక్కొని, కాలినడకన ఇంటికి రావాల్సి వస్తుందని ఏ ఒక్క క్షణంలోనైనా అనుకున్నానా? ఈ రోజున ఇలా గీత అడ్డం తిరిగిపోయింది. కనుక ఇలా ఇంతటి గతాన్ని భుజానవేసుకుని, పూలమ్ముకొన్నచోట కట్టెలమ్ముకోలేక ఇలా... ఇంకో ఊరు వచ్చేసి...

ఇల్లు చేరుకొన్నాను. నా చేతిలోని సంచీ సరోజ అందుకొంది మౌనంగా.. సంచిలోకి చూసింది. సంచిలోంచి కూరగాయలు సరోజను నవ్వుతూ పలుకరించాయి.

ఇంతలో వాకిలిదగ్గర ఎవరిదో అలికిడి అయితే అటు తిరిగాను - ఔను! అతనే! నన్ను వెతుక్కుంటూ నావెంట వచ్చేశాడన్న మాట! అప్రయత్నంగా లేచి నిలబడ్డాను.

ఆ అబ్బాయి నమస్కారంచేసి లోపలకు వచ్చాడు. ప్రతి నమస్కారం చేశాను.

“ఏమండీ...”

తెలుసు, అతను ఏం అడగబోతున్నాడో! నా ముఖం మలినమయిపోయింది. అలవాటు చొప్పున ముఖాన నవ్వు పులుముకొన్నాను.

“ఏమండీ.. మీరు ఒప్పుకొంటే... నాకు తెలుసు మీరు కరుణాకర్ గారని! మీరు ఒప్పుకుంటే మీకు సన్మానం చేద్దామని అనుకొంటున్నాం..”

“కరుణాకర్....?”

“అదేనండి మీరు ఆంధ్ర చిత్రసీమలో....” ఆగిపోయాడు అతను. కాదు, కాదు, నేను ఆపేశాను. ఆపేసి అన్నాను.. “క్షమించండి, మీరు అనుకొంటున్న కరుణాకర్‌ను కాను నేను, ఆయనకూ నాకు పోలికలున్నాయేమో! అయినా మీకు తెలీదేమో, ఆయన చనిపోయి చాలాకాలం అయింది.”

అతను క్షణం సేపు అవాక్కయిపోయాడు ఆ తర్వాత ఇంకేం అనాలో అర్థంకాక, అతను బయటకు నడిచాడు.

క్షణం తర్వాత... నాకు నేనే పెట్టుకొన్న చితిమంట ఆరకుండానే... నా ఎదురుగా సరోజ. సరోజ కళ్లల్లో నీళ్లు. ఆపుకొంటున్న వెక్కిళ్లు.

నెమ్మదిగా అన్నాను - “నన్ను క్షమించు సరోజా! జీవితంలో ఆఖరిసారి నటించాను. ఇంకెప్పుడూ నటించాను!”

భోరుమన్న సరోజతో మౌనంగా నేనూ....

*- ఆంధ్ర సచిత్ర వారపత్రిక, 28 మార్చి, 1975.*